

సర్వం కోల్పోయాం

ప్యాలకుర్తి ఉల్లి రైతులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

అధిక వర్షాలు.. పతనమైన ధరలు నిలువునా ముంచేశాయి... పంట కోత, రవాణా ఖర్చులు కూడా గిట్టుబాటు కాలేదు.. చివరికి అప్పులే మిగిలాయి.. ఒక ఏడాది లాభం వస్తే.. మూడేళ్లు నష్టం వస్తోంది. ఉల్లి సాగు చేయాలంటేనే భయమేస్తోంది.. కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలి.. లేదంటే ఆత్మహత్యలే శరణ్యం.. అంటూ ఉల్లి రైతులు కేంద్ర బృందానికి వివరించారు. రైతుల విన్నపాలు ఆలకించిన కేంద్ర బృందం సభ్యులు పూర్తి నివేదికలు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు ఇస్తామని వెల్లడించారు. అయితే కోడుమూరు మండలం ప్యాలకుర్తిలో అర గంట, మండల కేంద్రం గోనెగండ్లలో ఐదు నిమిషాలు మాత్రమే బృందం సభ్యులు వెచ్చించి రైతులతో మాట్లాడారు. మంగళవారం కేంద్ర బృందం ఉల్లి పంటను పరిశీలించిన తీరు ఇది. ఆ వివరాలపై ఆంధ్రజ్యోతి కథనం.



గాజులదిన్నెలో ఉల్లి రైతులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

- అధిక వర్షాలు.. పతనమైన ధరలు..
- పంట కోత, రవాణా ఖర్చులు కూడా గిట్టుబాటు కాలేదు
- ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యం
- ఒక ఏడాది లాభం.. మూడేళ్లు తీవ్ర నష్టం
- కేంద్ర బృందంతో ఉల్లి రైతుల ఆవేదన
- ప్యాలకుర్తిలో అర గంట.. గోనెగండ్లలో ఐదు నిమిషాలు
- ఇదీ కేంద్ర బృందం పర్యటన తీరు

కర్నూలు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025 ఖరీఫ్‌లో 45,278 హెక్టార్లలో రైతులు ఉల్లి సాగు చేసినట్లు ఉద్యానవన శాఖ అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా ఉల్లి సాగు చేసే జిల్లాల్లో కర్నూలు ఒకటి. ప్రధానంగా సి.బెళగల్, కోడుమూరు, గోనెగండ్ల, దేవనకొండ, ఆదోని, కోసిగి, ఎమ్మిగనూరు, పత్తికొండ, తుగ్గలి మండలాల్లో ఉల్లి సాగు అధికంగా చేస్తున్నారు. బోరుబావుల కిందే కాకుండా వర్షాధారంగా కూడా సాగు చేస్తున్నారు. ఆగస్టు ఆఖరు నుంచే పంట కోతకు వస్తుంది. అయితే.. పంట చేతికొచ్చే సమయంలో అధిక వర్షాలు ఉల్లి రైతులను కోలుకోని దెబ్బతీశాయి. అరకొర పంటను మార్కెట్‌కు తీసుకొస్తే పతనమైన ధరలు అప్పుల ఊబిలోకి నెట్టేశాయి. అప్పులకు వడ్డీలు కూడా చెల్లించలేని దైన్యపరిస్థితుల్లో రైతులు కుదేలయ్యారు. కష్టకాలంలో అండగా నేనున్నానని కూటమి ప్రభుత్వం క్వింటాలుకు రూ.1,200 కనీస మద్దతు ధర ప్రకటించి ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేపట్టింది. ఏపీ మార్క్‌ఫెడ్, లైసెన్స్‌డ్ వ్యాపారులు 2,800 మంది రైతుల నుంచి దాదాపుగా 1.55 లక్షల క్వింటాళ్లు ఉల్లి సేకరించారు. రైతులకు రూ.17 కోట్లు చెల్లించాల్సి ఉంది. వారం పది రోజుల్లోగా ఖాతాల జమ చేస్తామని ఏపీ మార్క్‌ఫెడ్ అధికారులు రైతులకు భరోసా ఇచ్చారు. రెండు నెలలు గడిచినా మెజార్టీ రైతులకు ఉల్లి డబ్బులు ఏపీ మార్క్‌ఫెడ్ ఇవ్వలేదని రైతులు అంటున్నారు. అదే క్రమంలో హెక్టారుకు రూ.50 వేలు నష్టపరిహారం చెల్లిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఇంత వరకు ఆ దిశగా చర్యలు శూన్యం.

అప్పుల ఊబిలో కూరుకుపోయాం..

జిల్లాలో ఉల్లి రైతుల కన్నీటి కష్టాలు క్షేత్రస్థాయిలో చూసి, ప్రభుత్వాలకు నివేదిక ఇచ్చేందుకు కేంద్ర బృందం సభ్యులు కేంద్ర ఉద్యానవన మంత్రిత్వ శాఖ డిప్యూటీ కమిషనర్ బీజే బ్రహ్మా, అండర్ సెక్రెటరీ మనోజ్, డిప్యూటీ డైరెక్టర్ రాజీవ్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ హేమాంగ్ భార్గవ్, సెంట్రల్ హెడ్ శరవణన్‌ల బృందం బుధవారం కోడుమూరు మండలం ప్యాలకుర్తి, గోనెగండ్ల మండలం గాజులదిన్నె, గోనెగండ్లలో ఉల్లి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఇప్పటికే మెజార్టీ పంటను రైతులు మార్కెట్‌కు తరలించి అమ్మకాలు చేశారు. కొందరైతే రవాణా ఖర్చులు రావడం లేదని పొలంలోనే వదిలేశారు. కేంద్ర బృందం ఏ ఉల్లి రైతును కదిపినా కన్నీటి సుడులే. 'అయ్యా..! ఎన్నో ఆశలతో ఉల్లి సాగు చేస్తే కన్నీళ్లు పెట్టించింది. ఒక ఏడాది లాభం వస్తే.. మూడేళ్లు నష్టపోతున్నాం. ఈ ఏడాది అధిక వర్షాలకు దిగుబడి భారీగా తగ్గిపోయింది. అరకొర దిగుబడిని మార్కెట్‌కు తీసుకెళితే ధరలు పతనమై అప్పుల ఊబిలోకి కూరుకుపోయాం. కూటమి ప్రభుత్వం ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కనీస మద్దతు ధర రూ.1,200కు కొనుగోలు చేసి కొంత ఊపిరి పోసినా, ఆ ధర కూడా గిట్టుబాటు కాలేదు. కనీస మద్దతు ధర రూ.2 వేలు కేంద్రం ప్రకటించి ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాల'ని విన్నవించారు. ఈ ఏడాది ఎకరాకు ఉల్లి సాగుకు రూ.లక్షకు పైగా ఖర్చు చేశామనీ, కేంద్ర ప్రభుత్వం ఆదుకునేలా నివేదిక ఇవ్వాలనీ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన హెక్టారుకు రూ.50 వేలు ఆర్థిక సాయం తక్షణమే ఇచ్చేలా చూడాలని కోరారు. అదే క్రమంలో ఉల్లి సాగు, రాయితీపై ఉల్లి విత్తనాల పంపిణీ, శీతల గిడ్డంగులు కొరత, ప్రభుత్వ ప్రోత్సాహం... తదితర వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు.

మిగతా 7వ పేజీలో



గోనెగండ్లలో ఉల్లి రైతులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దాం

- జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ధి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ధి

కర్నూలు లీగల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 13న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులను పరిష్కరించాలని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక న్యాయ సేవాసదన్ భవనంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పోలీసు అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్నికోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, రాజీకి వీలున్న క్రిమినల్, ఎక్సైజ్ కేసులను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కేసుల పరిష్కారానికి కక్షిదారులను సంప్రదించి రాజీకి వీలున్న కేసులను లోక్‌అదాలత్ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులే గాక.. ప్రిలిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చని కోర్టు మానిటరింగ్ పోలీసులు ఈమేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. పోక్సో కోర్టు న్యాయాధికారి రాజేంద్రబాబు, న్యాయాధికారులు అనిల్‌కుమార్, అపర్ణ, అనూష, పత్తికొండ, ఆళ్లగడ్డ డీఎస్పీలు వెంకట్రామయ్య, ప్రమోద్‌కుమార్, కర్నూలు దిశా పీఎస్ సీఐ రామానాయుడు, ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్‌తో పాటు ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన సీఐలు, ఎస్‌ఐలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారి

తుగ్గలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనం అందించాలని జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ సాధికారత అధికారి రాధిక ఆదేశించారు. మండలంలోని పెండేకల్ ఆర్‌ఎస్, జొన్నగిరి ఎస్సీ హాస్టళ్లను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలను, రికార్డులను, భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వం అందించిన దుప్పట్లను విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులకు ఏదైనా ఇబ్బంది కలిగితే వారిపై చర్యలు తప్పవన్నారు. విద్యార్థులకు రుచికరమైన వంటలు చేయడంతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్ పెట్టి వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్ష హాల్ టికెట్లు విడుదల

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష హాల్ టికెట్లు(అడ్మిట్‌కార్డ్స్) విడుదలైనట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ డిసెంబరు 13న శనివారం ఎంపిక పరీక్ష ఉంటుందని తెలిపారు. నేటి నుంచి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ అడ్మిట్ కార్డులను ఆన్‌లైన్‌లో తీసుకోవచ్చని తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే విద్యాలయాన్ని సందర్శించి సమాచారం తెలుసుకోవాలన్నారు.

పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: జడ్పీ సీఈవో



పలుకుదొడ్డిలో చెత్తసేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాసరరెడ్డి

సి.బెళగల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలలో పరిసరాల పరిశుభ్రత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని జడ్పీ సీఈవో నాసరరెడ్డి పంచాయతీ కార్యదర్శులను హెచ్చరించారు. మంగళవారం మండలంలోని పలుకుదొడ్డి, సంగాల గ్రామ పంచాయతీలలోని చెత్తసేకరణ కేంద్రాలను, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామ పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు ఇంటిపన్నులు వసులు చేయాలన్నారు. అలాగే పంచాయతీ అనుమతి లేకుండా పొలాలను ప్లాట్లు వేసి విక్రయించే రైతులకు నోటీసులు జారీ చేస్తూ ప్లాట్ల నెంబర్ రాళ్లను తొలగించాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు ఉన్నారు.

శిథిలావస్థకు చేరిన పాఠశాలల వివరాలు ఇవ్వండి

డీఈవో శామ్యూల్‌పాల్



మాట్లాడుతున్న డీఈవో శామ్యూల్‌పాల్

ఆలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరిన పాఠశాలల వివరాలు ఇవ్వాలని డీఈవో శామ్యూల్‌పాల్ ఆదేశించారు. మంగళవారం ఆలూరు మోడల్ స్కూల్‌లో నియోజకవర్గ స్థాయి హెచ్‌ఎంల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు కొన్ని చోట్ల శిథిలావస్థకు చేరి పెచ్చులు ఊడిపోయి విద్యార్థులపై పడిపోయి గాయాలైన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ముందు ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా వాటికి మరమ్మతులు గాని, కొత్త భవనాలు గాని నిర్మించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత ఏడాది పది ఫలితాల్లో వెనుకంజలో ఉందని, ఈ ఏడాది విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు వంద రోజుల ప్రణాళికను అమలు చేయాలన్నారు. ఇందుకోసం వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ వెంకటరమణరెడ్డి, సమగ్రశిక్ష డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంఈఓ కోమలాదేవి, ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం

- శ్రీమఠానికి 34 రోజుల్లో రూ.5.41 కోట్లు సమర్పించిన భక్తులు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

మంత్రాలయం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం శ్రీమఠం చరిత్రలో రికార్డు స్థాయిలో మొదటిసారిగా అధిక మొత్తంలో రూ.5,41,47,228 నగదు వచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, సురేష్ కోణాపూర్, శ్రీపతి ఆచార్ తెలిపారు. అక్టోబరు, నవంబరు నెలల్లో 34 రోజుల్లో భక్తులు సమర్పించిన హుండీ ఆదాయాన్ని మఠం గురురాజాంగణ భవనంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమరాల నిఘా మధ్య మంగళవారం లెక్కించారు. రూ.5,41,47,228 నగదుతో పాటు 1610 గ్రాముల వెండి, 80 గ్రాములు బంగారు, విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్లు చెప్పారు. వచ్చిన నగదును శ్రీమఠం బ్యాంకు ఖాతాకు జమ చేసినట్లు తెలిపారు. అయితే విదేశీ కరెన్సీ నోట్లను ఇంకా లెక్కించలేదని చెప్పారు. పెద్దమొత్తంలో హుండీ ఆదాయం చేకూరడంతో శ్రీమఠం అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో భక్తులకు సమష్టిగా సేవలు అందించడంతో సాధ్యమైందని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు సిబ్బందిని అభినందించారు. ఈ హుండీ లెక్కింపులో అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, అనంత పురాణిక్, జేపీస్వామి, కృష్ణమూర్తి, దేశాయ్ నరసింహమూర్తి, గిరిధర్, సుజ్ఞానేంద్ర, శ్రీపాదాచార్ పాల్గొన్నారు.

నేడు శ్రీశైలం ధర్మకర్తల మండలి సమావేశం

శ్రీశైలం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు చైర్మన్ పోతుగుంట రమేశ్ నాయుడు ఆధ్వర్యంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇది రెండో సమావేశమని చెప్పారు. సభ్యులందరూ హాజరవుతారని ఆయన తెలిపారు.

నేడు రైతుల పండుగ

- అన్నదాత సుఖీభవ కింద రూ.136.38 కోట్లు
- పీఎం కిసాన్ ద్వారా రూ.45.12 కోట్లు
- అన్నదాతల ఖాతాలకు జమ
- ఏర్పాట్లు చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం



కర్నూలు అగ్రికల్చర్/న్యూసిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు పండుగొచ్చింది. బుధవారం 2,72,757 మంది అర్హులైన రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఒక్కో రైతుకు రూ.5వేల ప్రకారం రూ.136.38 కోట్లు, కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ ద్వారా ఒక్కో రైతుకు రూ.2వేల ప్రకారం ఈ సంవత్సరం రెండో విడతగా రూ.45.12 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ కానున్నట్లు కలెక్టర్ సిరి తెలిపారు. మంగళవారం ఆమె టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ కర్నూలు అర్బన్‌లో 295 మంది రైతులకు రూ.15 లక్షలు, అన్నదాత సుఖీభవ పథకం కింద పీఎం కిసాన్ కింద రూ.3లక్షలు మొత్తం రూ.18 లక్షలు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారన్నారు. కోడుమూరు నియోజకవర్గంలో 35,000,52 మంది రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.17.526 కోట్లు, పీఎం కిసాన్ ద్వారా రూ.5.48 కోట్లు మొత్తం రూ.23 కోట్లు రైతులకు అంద జేయనున్నట్లు తెలిపారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 38,318 మంది రైతులకు అన్నదాత కింద రూ.19.159 కోట్లు, పీఎం కిసాన్ కింద రూ.6.881 కోట్లు జమ కానున్నాయి. ఆదోని నియోజకవర్గంలో 18,722 మంది రైతులకు అన్నదాత పథకం కింద రూ.9.36 కోట్లు, పీఎం కిసాన్ కింద రూ.2.96 కోట్లు మొత్తం రూ.12.32 కోట్లు. మంత్రాలయం నియోజకవర్గంలో 41,992 మంది రైతులకు అన్నదాత పథకం కింద రూ.20.996 కోట్లు, పీఎం కిసాన్ పథకం కింద రూ.6.62 కోట్లు మొత్తం రూ.27.616 కోట్లు జమ చేయనున్నట్లు తెలిపారు. పత్తికొండ నియోజకవర్గంలో 54,774 మంది రైతులకు రూ.27.387కోట్లు, పీఎం కిసాన్ కింద రూ.9.79కోట్లు మొత్తం రూ.37.177కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలకు పడుతాయన్నారు. ఆలూరు నియోజక వర్గంలో 63,317 మంది రైతులకు రూ.31.6585 కోట్లు, పీఎం కిసాన్ కింద రూ.10.43 కోట్లు మొత్తం రూ.42.0885 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలకు చేరుతాయన్నారు. పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లు, కల్లూరు మండలాల్లో .20,287 మంది రైతులకు అన్నదాత పథకం కింద రూ.10.1435 కోట్లు, పీఎం కిసాన్ కింద రూ.3.22 కోట్లు మొత్తం రూ.13.3635 కోట్లు జమ చేశామన్నారు. అన్ని నియోజకవర్గ కేంద్రాలు, గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో అన్నదాత సుఖీభవ పథకంతో పాటు పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు అందిన డబ్బులకు సంబంధించి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సిరి వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళ వారం ఆర్డీవోలు, వ్యవసాయశాఖ ఏడీలు, తహసీల్దార్లు, మండల వ్యవసాయ హార్టికల్చర్ అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బందితో కలెక్టర్ ఈ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు రాజన్ క్షీరసాగర్



మాట్లాడుతున్న అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు రాజన్ క్షీరసాగర్

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు రాజన్ క్షీరసాగర్, ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య కోరారు. ఆదోని జేబీ గార్డెన్‌లో మంగళవారం రాష్ట్ర స్థాయి పత్తి రైతుల సమ్మేళనాన్ని ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రామచంద్రయ్య అధ్యక్షతన నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ క్వింటం పత్తికి రూ. 12 వేలు చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో క్వింటానికి రూ.3 వేలు బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీసీఐ 11 కింటాళ్లు కొంటామని మాట ఇచ్చి కేవలం 7 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయడం దారుణమని అన్నారు. రైతు ప్రయోజనాలను సీసీఐ దెబ్బతీస్తూ కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య మాట్లాడుతూ గతంలో ఆదోని, ఎమ్మిగనూరు, నంద్యాల, గుంతకల్లు, కడపలో స్పిన్నింగ్ మిల్లులు ఉండేవని, అయితే నేడు ఆదరణ లేక మూతపడ్డాయని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం నిధులు కేటాయింపులో ప్రభుత్వం వివక్ష చూపడం వల్ల రాయలసీమ రైతులు వలస బాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుండ్రేవుల, వేదవతి, ఆర్డీఎస్, సిద్ధేశ్వరం, గండికోట ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. టమోటా, ఉల్లి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. పత్తి గ్రేడింగ్ పనులకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేస్తే వ్యవసాయ రంగం బాగుంటుందని అభిప్రాయపడ్డారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు రామాంజినేయులు, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, జిల్లా అధ్యక్షుడు నాగేంద్రయ్య, పంపన్న గౌడ్, వీరేష్, సురద్యన్ రాజు పాల్గొన్నారు.

నిండా మునిగాం

- కేంద్ర బృందం వద్ద ఉల్లి రైతుల గోడు
- ప్యాలకుర్తిలో ఉల్లి పంట పరిశీలన



ప్యాలకుర్తిలో రైతుతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

కోడుమూరు రూరల్, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది అధిక వర్షాలు, మార్కెట్‌లో ధరల పతనం కారణంగా నిండా మునిగిపోయామని కేంద్రబృందం ఎదుట ఉల్లిరైతులు గోడు వినిపించారు. ఓ ఏడాది మంచి లాభాలు వస్తే మూడేళ్ల నష్టాల తప్పడం లేదన్నారు. మంగళవారం ఉల్లి రైతుల సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చిన కేంద్ర బృందం సభ్యులు మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో రైతు మోదీన్ పొలంలో పరిశీలించారు. పంటసాగు సమస్యలపై ఆయనతో సంభాషణ ఇలా సాగింది.

డిప్యూటీ కమిషనర్ బ్రహ్మ: ఉల్లి సాగు ఎలా ఉంది?

రైతు మోదీన్: ఈ ఏడాది దారుణ పరిస్థితులు ఎదుర్కొన్నాం. అధిక వర్షాల కారణంగా ఉల్లి నాణ్యత దెబ్బతిని దిగుబడి పడిపోయింది. దీనికితోడు మార్కెట్‌లో ధరల పతనం వలన కోత ఖర్చులు కూడా లభించడం లేదు. దీంతో తీవ్ర నష్టాలు ఎదుర్కొన్నాం.

డిప్యూటీ కమిషనర్: ప్రభుత్వం చర్యలు తీసుకుంది కదా?

మోదీన్: మార్కెట్‌లో ఉల్లి ధర పతనం కావడంతో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా రూ. 1200 మద్దతు ధరతో కొనుగోలు చేసింది. అయితే మధ్యలోనే మద్దతు ధర తొలగించి హెక్టారుకు రూ. 50 వేలు సాయం ప్రకటించింది. ప్రభుత్వసాయం ఏమూలకు సరిపోదు.

డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మిద్దాం



ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): డ్రగ్ లేని సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని నగర పాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. మంగళశారం నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా నగరంలోని కొండారెడ్డి బురుజు వద్ద ఉద్యోగులు, సిబ్బందితో మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయించారు. కేంద్ర సామాజిక న్యాయ సాధికారిత మంత్రిత్వ శాఖ అధ్వర్యంలో చేపట్టిన నషా ముక్త్ భారత్ అభియాన్ గొప్ప ప్రాజెక్టు అని తెలిపారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి దేశాన్ని ప్రగతి వైపు నడిపించాలని సూచించారు. మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డా.నాగశివప్రసాద్, ఆర్‌వో జునైద్, కార్యదర్శి నాగరాజు, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

కల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సహకార వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటనలో తెలిపారు. బుధవారం మహావీర్‌నగర్‌లోని కల్లూరు వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో చేపట్టే కార్యక్రమానికి కేడీసీసీ బ్యాంకు చైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి హాజరు కానున్నారని ఉలిందకొండ, కల్లూరు సీఈఓలు హారిఫ్‌బాషా, పుల్లయ్య తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార సంఘం ఉద్యోగులు, రైతులు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పాఠశాలకు కంప్యూటర్ విరాళం



కంప్యూటర్ అందజేస్తున్న దాత రమేష్ రెడ్డి

ఓర్వకల్లు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడు జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు గ్రామానికి చెందిన పద్మావతి మనుమడు రమేష్ రెడ్డి మంగళవారం కంప్యూటర్‌ను అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు. హెచ్ఎం అయ్యన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిడ్మా ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య

కర్నూలు న్యూసిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు నాయకుడు హిడ్మా ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఆంధ్ర, తెలంగాణ సరిహద్దుల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి గ్రామంలో మావోయిస్టు హిడ్మా ఆయన భార్యను ఎన్‌కౌంటర్ పేరుతో హతమార్చడాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఇప్పటికైనా మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని కోరారు.

శివాలయ ముఖ ద్వారానికి భూమి పూజ

గూడూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాడు గ్రామం రామలింగేశ్వర స్వామి ఆలయ ముఖ ద్వార పనులను టీడీపీ నాయకుడు ఆర్ చంద్రారెడ్డి, ఆర్ అనంతమ్మ దంపతులు మంగళవారం ప్రారంభించారు. ఆర్ మల్లికార్జున రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఆర్ విజయబాస్కర్ రెడ్డి, ఆర్ వెంకటేశ్వర రెడ్డి, ఆర్ పద్మావతి, కళ్యాణి పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న టీడీపీ నాయకుడు చంద్రా రెడ్డి

శక్తి యాప్‌తో మహిళలు, విద్యార్థినులకు రక్షణ

గూడూరు నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖ ప్రవేశపెట్టిన శక్తియాప్‌తో మహిళలు, విద్యార్థినులకు రక్షణగా నిలుస్తుందని కర్నూలు సబ్ డివిజన్ శక్తి టీం సభ్యులు హెచ్‌సీ ఎస్ ఎం బాషా, పీసీ చిన్న రాజు అన్నారు. మంగళవారం గూడూరు మండలంలోని జులకల్ గ్రామం మోడల్ స్కూల్‌లో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ దిల్షాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీసీ హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి విద్యార్థి సంఘాల నాయకులు ఆనంద్‌బాబు, కోనేటి వెంకటేశ్వర్లు, కిరణ్ కుమార్ కోరారు. మంగళవారం బీసీ సంక్షేమాధికారి ప్రసూనకు వినతి పత్రం అందజేశారు. పేద విద్యార్థులు చదువుకుంటున్నారని చలికాలం కావడంతో విద్యార్థులకు బెడ్‌షీట్లు, బ్లాంకెట్స్ పంపిణీ చేయాలని, మెనూలో నాణ్యత పాటించాలని విజ్ఞప్తి చేశారు.



వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి నాయకులు

ఆకలితో ఉన్నవారిని ఆదుకోవాలి

కర్నూలు కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆకలితో ఉన్న వారిని ఆదుకోవాలలేనని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ మాకా అశోక్‌కుమార్ అన్నారు. పుట్టపర్తి సత్యసాయిబాబా జయంతిని నగరంలోని నెహ్రూనగర్ సత్యసాయి మందిరంలో నిర్వహిస్తున్నారు. ఈ నెల 23 వరకు ఈ వేడుకలు కొనసాగుతాయని తెలిపారు. పెద్దాసుపత్రిలోని 520 మంది రోగులకు యాపిల్ పండ్లు, బిస్కెట్లు, జ్యూస్ డబ్బాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కన్వీనర్ మాకా అశోక్‌కుమార్, కృష్ణారెడ్డి, సూర్యనారాయణ, సందీప్, బాలకృష్ణ, పార్వతి, గీత, సరోజ తదితరులు పాల్గొన్నారు.



పండ్లు ఇస్తున్న అశోక్‌కుమార్

భూసార పరీక్షతో దిగుబడి



శనగ పంటను పరిశీలిస్తున్న ఏవో మల్లేష్ కుమార్

సి.బెళగల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు భూసార పరీక్ష చేయించి పంటలు సాగుచేస్తే దిగుడి వస్తుందని ఏవో మల్లేష్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని పోల్లకల్లు గ్రామ శనగ పొలంలో 'పొలంపిలుస్తోంది' నిర్వహించారు. భూసార పరీక్షలు చేయకుండా సాగుచేస్తే నష్టపోతారని, రైతులు పంటమార్పిడి పాటించాలన్నారు.

ఆరోగ్యకరమైన జీవనశైలి అలవరచుకోవాలి

- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్యం శాఖ మంత్రి టీజీ భరత్ సూచించారు. మంగళవారం నగరంలోని సంకల్‌బాగ్ విశ్వక్ గార్డెన్స్‌లో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'బాలదంత సురక్ష' నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ రోజూ ఉదయం, రాత్రి దంతాలను శుభ్రం చేసుకోవడం అవసరమన్నారు వ్యాయామం, క్రీడలు బాల్యం నుంచే అలవాటు చేసుకోవాలని సూచించారు. సోమిశెట్టి శ్రీకాంత్, నభూషా డెంటిస్టులు డాక్టర్ శ్వేత, డా.సునీత, డా.దివ్య, రజిత విభు, సేజన్, ఫర్హానా ఉన్నారు.



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

గ్రంథాలయాల సేవలు విలువైనవి

కర్నూలు కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల సేవలు విలువైనవని గాడిచర్ల ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కేసీ కల్కూర అన్నారు. కేంద్ర గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఐదోరోజు మంగళవారం కార్యక్రమాలను ప్రారంభించారు. గ్రంథాల యాల పురోభివృద్ధికి పాటుపడిన వ్యక్తిగా స్వాతంత్ర్య సమరయోధుడు గాడిచర్ల హరి సర్వోత్తమ రావు నిలిచిపోతారని కొనియాడారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు ర్రరవహించారు. ఇన్‌చార్జి కార్యదర్శి పెద్దక్కను సన్మానించారు. విశ్రాంత పండితులు పి. కేశవాచార్యులు, బీవో గంగిరెడ్డి, డాక్టర్ ఎం. నాగరాజు, దొరస్వామి, జాకీర్ హుస్సేన్, లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, ఎస్ బాషా, నఫీమా బీ, మక్బుల్‌బాషా తదితరులు పాల్గొన్నారు



పెద్దక్కను సన్మానిస్తున్న కేసీ కల్కూర

భక్తిశ్రద్ధలతో ధన్వంతరి హోమం

కర్నూలు కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యభారతి కర్నూలు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. గణేశ్‌నగర్ విజయ గణపతి ఆలయంలో ధన్వంతరి హోమం చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మన ఆరోగ్యం మనం తినే ఆహారంలోనే ఉందని తెలిపారు. డాక్టర్ పి. మోక్షేశ్వరుడు, డాక్టర్ ఎస్ వెంకటరమణ, ఎండీపీఎన్ రామశర్మ, బి. సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

రహదారి విస్తరణ వేగవంతం చేయండి

- నగరపాలిక కమిషనర్ విశ్వనాథ్



అధికారులతో సమావేశమైన నగరపాలక సంస్థ కమిషనర్

కర్నూలు కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కిడ్స్ వరల్డ్ నుంచి బుధవారపేట వంతెన వరకు రహదారి విస్తరణ పనులు మరింత వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. మంగళవారం కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగం, ఆర్ అండ్ బీ అధికారులతో సమావేశం నిర్వహించారు. విస్తరణలో ప్రభావితమవుతున్న 180 ఆస్తుల్లో ఇప్పటి వరకు 50 మంది యజమానులు అంగీకారం తెలిపారని, మిగిలిన యజమానులు సహకరిస్తే విస్తరణ పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రభావితులకు టీడీఆర్ బాండ్లు జారీ చేస్తామని, నష్టపరిహారం కూడా ఇస్తామన్నారు. ఆర్ అండ్ బీ ఎంఈ సునీల్, డీఈ ఫణిరామ్, డీసీపీ వెంకటరమణ, టీపీవో అంజాద్ బాషా, పరమేష్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

నేడు సర్పంచుల సమావేశం

కోడుమూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు సర్పంచులకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాముడు మంగళవారం ప్రకటనలో తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలన్నారు.

పథకాలను వినియోగించుకోవాలి

గూడూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వ పథకలను సద్వినియోగం చేసుకోవాలని సింగిల్‌విండో చైర్మన్ దానమయ్య కోరారు. మంగళవారం గూడూరులో సహకార వారోత్సవాల్లో భాగంగా సింగిల్‌విండో అధ్యక్షుడు దానమయ్య జెండాను ఆవిష్కరించారు. డీసీవో వెంకటకృష్ణ, డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, అల్లిపీరా, పట్టణ టీడీపీ అధ్యక్షుడు రామాంజనేయులు, సృజన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ పోటీలకు బి.క్యాంపు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు సంపత్, జహీర్ ఎంపికైనట్లు హెచ్ఎం జి.శంకర్ తెలిపారు. మంగళవారం విద్యార్థులను అభినందించారు. ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరిగే అండర్-14 ఫుట్‌బాల్ పోటీలకు 8వ తరగతి విద్యార్థి ఎస్.సంపత్ కుమార్, అండర్-17 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు పదో తరగతి విద్యార్థి జహీర్ ఎంపిక సంతోషకరమన్నారు. పూర్వపు పీడీలు ఉమామహేశ్వరి, విజయకుమార్ జగన్మోహన్ పర్యవేక్షణలో ఎంపిక కావడం హర్షణీయమన్నారు హరిశంకర్, అన్వర్‌బాషా పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

కురువ సంఘం మాజీ అధ్యక్షుడి మృతి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కురువ సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు నాగన్న మంగళవారం మృతిచెందారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న, కర్నూలు జిల్లా కురువ సంఘం అధ్యక్షులడు పత్తికొండ శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి సంతాపం తెలిపారు. నాగన్న మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సంఘం గౌరవ సలహాదారుడు పాల సుంకన్న, ఉపాధ్యక్షుడు ధనుంజయ, తౌడు శ్రీనివాసులు రామకృష్ణ పాల్గొన్నారు.

21న కాల్వబుగ్గలో వేలం పాటలు

ఓర్వకల్లు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 21న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో మద్దిలేటి మంగళవారం తెలిపారు. టెంకాయలు అమ్ముకునే హక్కు, పార్కింగ్ ఫీజుల వసూలు, 1, 3 అంగళ్లు, టెంకాయ చిప్పలు పోగు చేసుకునే హక్కుపై బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. పాటాదారులు డిపాజిట్ చెల్లించి వేలాల్లో పాల్గొనాలన్నారు. చైర్మన్ కాటినేని నారాయణ, ధర్మకర్త కాకి దేవేంద్ర పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

కోడుమూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పదో తరగతితో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రణాళిక రూపొందించుకోవాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ హెచ్.గోవిందనాయక్ సూచించారు. మంగళవారం జీవీఆర్ జడీప ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. చదువులో వెనకబడ్డ విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. హెచ్ఎం రామచంద్రుడు, ఉపాధ్యాయులు ఉస్మాన్, రత్నానాయక్, ఆదామ్, షరీఫ్, ననినేపాటి, సోమశేఖర్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంపై 'ఆవాజ్' సంతాపం

కర్నూలు న్యూసిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మక్కాలో బస్సు సంఘటనలో 45మంది మృతిపై ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎ.సుబాన్ సంతాపం తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ మక్కా దర్శనం అనంతరం తిరిగి వస్తున్న హైదరాబాదీయులు బస్సు దుర్ఘటనలో చనిపోవడం బాధాకరమని, మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండి.షరీఫ్, ఉన్నారు.

శిక్షణను విజయవంతం చేయండి

ఓర్వకల్లు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సుస్థిరాభివృద్ధిపై ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 19, 21, 26 తేదీల్లో నిర్వహించే శిక్షణను విజయవంతం చేయాలని ఎంపీడీవో నాగ అనుసూయ కోరారు. మంగళశారం మాట్లాడుతూ 19న పంచాయతీ కార్యదర్శులు సర్పంచులు ఉప సర్పంచులు, 21న మండల రిసోర్స్ కోఆర్డినేటర్లు, అంబాసిడర్లు, గ్రీన్ గార్డులు, 26న గ్రామైక్య సంఘం సభ్యులు, స్వయం సహాయక సంఘం సభ్యులు హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

పంట రుణాలను వినియోగించుకోవాలి



రైతుకు చెక్కు అందజేస్తున్న తిమ్మప్ప

సి.బెళగల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు పంట రుణాలను వినియోగించుకోవాలని ఇంగిల్‌విండో ప్రెసిడెంట్ డాక్టర్ తిమ్మప్ప సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని సొసైటిలో రైతులకు పంట రుణాల చెక్కులను అందజేశారు. సొసైటీ ద్వారా రూ.45 లక్షల రుణం ఇచ్చామని, రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించి సొసైటీ అబివృద్ధికి సహకరించాలన్నారు. సొసైటీ సెక్రెటరీ ఖాజ, సిబ్బంది, ఆచారి, శేఖర్, రైతులు ఈశ్వర్, ఈరన్న, జయమ్మ, రెడ్డి ఉన్నారు.

ఏపీ ఎన్జీవో బలోపేతమే లక్ష్యం

కర్నూలు హాస్పిటల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏపీ ఎన్జీవోను బలోపేతం చేయడమే లక్ష్యమని కర్నూలు నగర అధ్యక్షుడు ఎంసీ కాశన్న అన్నారు. మంగళవారం రీజినల్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ కే.పద్మావతి, ఫీమేల్ ట్రైనింగ్ సెంటర్ వైస్ ప్రిన్సిపాల్ జయలక్ష్మి, జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయ ఏవో కే.అరుణ మలేరియా అధికారి ఏ.నూకరాజు, సిబ్బందికి సభ్యత్వ నమోదు చేశారు. మెడికల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్, ఏపీ హంసా జిల్లా అధ్యక్షుడు రఘుబాబు, ఏపీ ఎన్జీవో జిల్లా సంయుక్త కార్యదర్శి కృష్ణుడు, ఆదోని తాలుకా కోశాధికారి మంజునాథ్ ఉద్యోగులు పాల్గొన్నారు.



సభ్యత్వం ఇస్తున్న నగర అధ్యక్షుడు కాశన్న

పంచాయితీలు చేస్తే కఠిన చర్యలు : ఎస్ఐ

సి.బెళగల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పంచాయితీలు చేసి, డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వేణుగోపాల్‌రాజు హెచ్చరించారు. మంగళవారం మాట్లాడుతూ మండలంల కొందరు పెద్దమనుషుల పేరుతో పంచాయతీలు చేసి, డబ్బు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. భూసమస్యలు ఉన్న రైతులు రెవెన్యూ అధికారులను సంప్రదించి కొలుతలు వేయించుకోవాలన్నారు. ప్రజలు సోదరభావంతో వ్యవహరించి గొడవలకు దూరంగా ఉండాలన్నారు.

యువతిని మోసం చేయడంపై విచారణ జరపాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో గిరిజన యువతిని నమ్మించి మోసం చేసిన చేసిన ఘటనపై విచారణ చేసి, నిందితులను శిక్షించాలని టీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు అక్కులప్ప నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడలో ఎస్టీ కమిషన్ చైర్మన్ సోలా బుజ్జిరెడ్డిని కలిసి గిరిజన సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణు నాయక్, ఉపాధ్యక్షుడు రవీంద్ర నాయక్, వెంకటేశ్, ఎస్వైఎఫ్ అధ్యక్షుడు శివకుమార్ పాల్గొన్నారు.

పత్తి రైతులు ఆందోళన చెందొద్దు

కోడుమూరు రూరల్, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి): కిసాన్ యాప్‌లో రిజిస్ట్రేషన్లు మందకొడిగా సాగుతున్నాయని, పత్తి రైతులు ఆందోళన చెందవద్దని ఏవో రవిప్రకాష్ సూచించారు. మంగళవారం అమడగుంట్ల రైతు సేవాకేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. పత్తిని సీసీఐకి మద్ధతు ధరకు విక్రయించుకోవచ్చన్నారు. తేమశాతం అధికం కాకుండా చూసుకోవాల న్నారు. అనంతరం కంది పంటను పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మీ, ఏఈవో బాలకృష్ణ, సెరికల్చర్ అసిస్టెంట్ సావిత్రి పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏవో రవిప్రకాశ్

రాయలసీమ 97వ ఆత్మగౌరవ దినం



ఆవిర్భావ దినోత్సవంలో మాట్లాడుతున్న సీమకృష్ణ రాథోడ్

కర్నూలు అర్బన్ నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ 97వ ఆత్మగౌరవ దినోత్సవం గర్వకారణమని ఉద్యమ నాయకుడు సీమ కృష్ణ రాథోడ్ అన్నారు. మంగళవారం నగరంలోని బిర్లా కాంపౌండ్ విజేత కోచింగ్ సెంటర్లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. 1928 నవంబరు 17,18 తేదీల్లో నంద్యాలలో జరిగిన ఆంధ్ర మహాసభలో దత్తమండలానికి బదులుగా రాయలసీమ పేరును ప్రతిపాదించడం చాత్రిక ఘట్టమని తెలిపారు. అనంతపురం కాలేజీ ఆధ్యాపకుడు చిలుకూరి నారాయణరావు రాయలసీమ మన ప్రాంతానికి గౌరవప్రదమన్నారు.

కార్తీక 'మాస శివరాత్రి' పూజలు

కర్నూలు కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సంకల్‌బాగ్‌లోగల హరిహర క్షేత్రంలో కార్తీక మాసంలోని కార్తీక 'మాస శివరాత్రి'ని నిర్వహించారు. మంగళవారం సాయంత్రం పంచామృతాభిషేకములు, జలాభిషేకములు, నారీకేళ తీర్థాభిషేకములు చేపట్టి స్వామి వారిని ప్రత్యేక వస్త్రాలతో, పూలతో అలంకరణ చేశారు. శివాలయం ప్రధాన అర్చకుడు మహేష్ శర్మ నేతృత్వంలో వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులతో సామూహిక హోమాలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదం పంపిణీ చేశారు. నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్, ఇతర ప్రతినిధులు సీవీ దుర్గాప్రసాద్, చల్లా నాగరాజు శర్మ, శ్యామసుందరరావు, నాగులవరం రాజశేఖర్, సీఎస్ ప్రసాదరావు, టీవీ రవిచంద్రశర్మ, కమిటీ సభ్యులు శ్రీనివాసరాజు, సుబ్బయ్య, హరిశర్మ, శివన్న, సుధాకర్ పాల్గొన్నారు.

హిందూ ప్రచార సాధకులకు న్యాయం చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హిందూ ప్రచార సాధకులకు న్యాయం చేయాలని బేడ, బుడగ జంగం నాయకుడు తూర్పాటి మనోహర్ కోరారు. బుధవారపేటలోని ఆలయంలో బేడ బుడగ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వనభోజనం నిర్వహించారు. బేడ బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరారు.

నేడు జి.ఎర్రగుడికి ఎమ్మెల్యే

తుగ్గలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అన్నదాత సుఖీభవ కార్యక్రమం పథకం కింద రైతులకు చెక్కులను అందజేసేందుకు పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు జి.ఎర్రగుడికి రానున్నట్లు వ్యవసాయాధికారి సురేష్ యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ వెంకటస్వామి తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ రెండో విడత అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాలో నగదును ప్రభుత్వం జమ చేస్తుందని, అందులో భాగంగా తుగ్గలి మండల రైతులకు అన్నదాత సుఖీభవ పథకం చెక్కులు అందజేసేందుకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు వస్తున్నారన్నారు.

శబరిమల పాదయాత్ర సంపూర్ణం

ఆదోని టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శబరిమలలో అయ్యప్ప స్వామి దర్శనం కోసం ఆదోని నుండి 17వ సారి పాదయాత్రగా బయలుదేరిన గురుస్వామి శ్రీనివాస ఆచారి బృందం 18వ తేదీన అయ్యప్ప సన్నిధానానికి చేరుకొన్నారు. 34 రోజుల పాటు అన్ని పుణ్యక్షేత్రాలను దర్శించుకొంటూ కొనసాగిన పాదయాత్ర ఎలాంటి అవాంతరాలు లేకుండా సంపూర్ణంగా ముగిసిందని గురుస్వామి తెలిపారు. శ్రీనివాస రెడ్డిస్వామి, మూర్తిస్వామి, రాముస్వామి, నాగరాజ్ స్వామి, మునిస్వామి, రంగన్న స్వామి పాల్గొన్నారు.

మండల మాజీ ఉపాధ్యక్షుడి మృతి

దేవనకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేవనకొండ మండల మాజీ ఉపాధ్యక్షుడు, టీడీపీ మాజీ కన్వీనర్ నేలతలమర్రి కుమారస్వామిగౌడ్ (74) అనారోగ్యంతో మృతి చెందాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో మృతి చెందిన్నట్లు మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్‌గౌడ్ తెలిపారు. పత్తికొండ ఎమ్మెల్యే కెఈ శ్యాంబాబు, మాజీ మంత్రి కెఈ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, టీడీపీ నాయకులు వైకుంఠం శివప్రసాద్ మృతదేహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

వైభవంగా సుంకులమ్మ దేవాలయ ప్రారంభోత్సవం

తుగ్గలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):భక్తుల ఇలవేల్పు శ్రీ సుంకులమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. మంగళవారం మండల పరిధిలోని పైచింతలకొండలో భక్తులు దాత కోయలకొండ రామచంద్ర రూ.3.50 లక్షలతో నిర్మించిన సుంకులమ్మ అమ్మవారి దేవాలయాన్ని ప్రారంభించారు. వేదపండితుల మంత్రోచ్చరణాల మధ్య అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠించడంతో పాటు నాగులకట్టను నిర్మించారు. భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మద్దికెర: మండల కేంద్రంలోని మద్దికెర గ్రామానికి ఒక కిలోమీటరు దూరంలో వెలసిన చిన్న ఈదుల సుంకులమ్మ కలశ ప్రతిష్ట అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవారం సుంకులమ్మ దేవాలయంలో మూలవిరాట్ సుంకులమ్మను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి దేవాలయ గోపురం కలశ ప్రతిష్టను చేశారు. సర్పంచ్ బండారు సుహాసిని, జడ్పీటీసీ సభ్యులు డి.మురళీధర్ రెడ్డి, ఎంపీడీవో కొండయ్య, ఏపీవో నర్సిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, కీర, సుబ్బారెడ్డి, నరసింహులు, విజయమోహన్ పాల్గొన్నారు.

వెల్దుర్తి: మండల కేంద్రమైన వెల్దుర్తి గ్రంథాలయంలో మంగళవారం లైబ్రేరియన్ తోటమ్మ ఆధ్వర్యంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని 'స్వాతంత్ర్య ఉద్యమం'పై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

ప్రతి చెరువును హంద్రీనీవా నీటితో నింపాలి

తుగ్గలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):మండలంలోని చెరువులన్నింటినీ నీటితో నింపాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆనంద్‌బాబు,భాస్కర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తుగ్గలి, తదితర గ్రామాల్లో జీపుజాత నిర్వహించి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొండారెడ్డి, రంగరాజు, రంగస్వామి, తదితరులు ఉన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

వెల్దుర్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రమైన వెల్దుర్తిలో పలు అభివృద్ధి పనులకు మంగళవారం టీడీపీ మండల అధ్యక్షుడు బలరాంగౌడు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా బలరాంగౌడు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా 15వ వార్డు కోళ్లఫామ్ వీధి మౌలిక సదుపాయాలకు నోచుకోలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామిమేరకు ప్రతి ఇంటికి కొళాయి, డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్డు నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సహకారంతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఎర్రబజారు, మోషా, నరేశ్, రాంబాబు, రాఘవేంద్ర, సూరి పాల్గొన్నారు.

'ప్రభుత్వం విఫలం'

దేవనకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో హంద్రీనీవా పెండింగ్ పనులు, సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడంలో ప్రభుత్వం విఫలమైన్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, వీరశేకర్ అన్నారు. మండలంలోని తెర్నేకల్‌లో సీపీఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా బైక్ ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో అశోక్, మహబుబ్‌బాష, సూరి, పరమేషు, తదితరులు ఉన్నారు.

రైతులకు అవగాహన కల్పించాలి

- మిరప పంటకు కాయకుళ్లు, మచ్చ తెగులు నివారించాలి : కలెక్టర్ సిరి
- ఆస్పరి కేజీబీవీ, సచివాలయాల సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం


రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

ఆదోని, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మిరప పంటకు కాయ కుళ్లు, కాయ మచ్చ వంటి వ్యాధులు నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతుసేవా కేంద్రాల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సిరి రైతులకు సూచించారు. ఆదోని మండలం మదిరె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మదిరె గ్రామానికి చెందిన పెద్దయ్య అనే రైతు మిరప పంట సాగును, ఎన్‌డీబీఎల్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్, దాదాపీర్ మిల్ యూనిట్‌లలో పత్తి కొనుగోలు ప్రక్రియను, అన్నా క్యాంటీన్‌లను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

పత్తి రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సిరి అన్నారు.. పత్తి రైతులు వారి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకుని రాగా, వాటిని పరిష్కరించేచ విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

అన్న క్యాంటీన్‌లో రుచి, శుచితో భోజనాన్ని అందించాలి

అన్న క్యాంటీన్ ద్వారా రుచి, శుచితో ఉన్న భోజనాన్ని ప్రజలకు అందించాలని కలెక్టర్ అన్న క్యాంటీన్ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ నేరుగా భోజనం వండిస్తున్న ప్రదేశం వద్దకి వెళ్లి అన్నం, సాంబారును పరిశీలిస్తూ అక్కడే ఉన్న అన్న క్యాంటీన్ సిబ్బందితో మాట్లాడారు. అనంతరం అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ప్రజలకు కలెక్టర్ స్వయంగా వడ్డించారు. ఎన్‌డీబీఎల్ పత్తి పరిశ్రమ యజమాని కుబేర్‌నాథ్, ఆదోని ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ అజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారిణి వరలక్ష్మీ మార్కెటింగ్ ఏడీ నారాయణమూర్తి, తహసీల్దార్ రమేష్ పాల్గొన్నారు.

ఆదోని టౌన్ : ఆదోని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని అన్నా క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్ డా. ఏ సిరి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో అందిస్తున్న భోజనం నాణ్యత, రుచి గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నిర్వాహకులు పాటిస్తున్న పరిశుభ్రత ను పరిశీలించారు. క్యాంటీన్ నిర్వహణపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఆ సమయలో భోజనం కోసం వేచి ఉన్న ప్రజలకు ఆమె స్వయంగా భోజనం వడ్డించారు.

● రానున్న వేసవి కాలంలో పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా ఏ సిరి ఆదోని మునిసిపల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె పట్టణానికి తాగునీటిని అందించే బసాపురం చెరువు(ఎస్ఎస్ ట్యాంక్) ఆనకట్టకు ఏర్పడిన పగుళ్లకు జరుగుతున్న తాత్కాలిక మరమ్మత్తు పనులను పరిశీలించారు. ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, తహసీల్దార్ రమేష్ మునిసిపల్ ఇన్‌చార్జి కమిషనర్ నాసిర్ హుస్సేన్, డీఈఈలు వెంకట చలపతి, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆస్పరి: ప్రజాసేవలో పనిచేస్తున్న సచివాలయ, వసతిగృహాల సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం తగదని జిల్లా కలెక్టర్ ఎ.సిరి హెచ్చరించారు. మంగళవారం మండలకేంద్రమైన ఆస్పరిలోని కేజీబీవీ పాఠశాల, గ్రామ సచివాలయాలను కలెక్టర్ సిరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం వీడి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సచివాలయ సిబ్బందిక సూచించారు. కేజీబీవీ పాఠశాలల్లో 250 మంది విద్యార్థులకు ఇస్తున్న ఆహార నాణ్యతను మెనూ తప్పనిసరిగా పాటించాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎ కలెక్టర్ వెంట డీఈఓ శామ్యూల్‌పాల్, తహసీల్దార్ రామేశ్వరరెడ్డి, ఎంపీడీఓ గీతావాణి, ఎంఈఓ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

దేవనకొండ: పది పరీక్షలో కష్టపడి చదవి మంచి మార్కులు తెచ్చుకోవాలని కలెక్టరు డా. ఏ సిరి పదో తరగతి విద్యార్థులకు సుచించారు. మంగళవారం దేవనకొండలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రం1 లో చిన్నారులతో కలెక్టరు ముచ్చటించారు. . జెడ్పీపాఠశాలకు వెళ్లి పెచ్చులూడిన తరగతి గదిని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. పరీక్షలంటే భయంతో కాకుండా ఇష్టంగా చదవలాన్నారు. కష్టాలను అధికమిస్తేనే తరువాత వచ్చే గెలుపు రూచి తెలుస్తుందని, విద్యార్థులు ఆదిశగా ముందుకు వెళ్లాలన్నారు. మధ్యాహ్న బోజనానికి చేసిన పులిహోర రుచికరంగా లేదని, వంట ఏజెన్సీ నిర్వహకులపై మండిపడ్డారు. పిల్లల బోజనాన్ని పర్యవేక్షణ కోరవడిందని, విద్యార్థుల బోజనాన్ని అధికారులు పరిశీలించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

అన్ని సేవలు అందుబాటులోకి తెస్తున్నాం

ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు కృషిచేస్తున్నామని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. ఆసుపత్రిలో నూనతంగా ఏర్పాటు చేసిన ఎక్స్‌రే విభాగాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో రోగులు ఆసుపత్రికి చిన్నసమస్యతో వైద్యసేవల కోసం వచ్చినా కర్నూలుకు రెఫర్‌చేసే పరిస్థితులు ఉండేవన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన ఏడాదిన్నరలో ఆసుపత్రిలో వాటర్‌ప్లాంట్, ఆపరేషన్ థియేటర్, గర్బిణీలకు ఉచిత భోజన సదుపాయం అందుబాటులోకి తెచ్చామని, అత్యాధునిక ఎక్స్‌రే విభాగాన్ని ఈ రోజు ప్రారంభించామన్నారు. ఆసుపత్రిని మరింత ఆధునీకరించేందుకు రూ.3కోట్లు నిధులు మంజూరయ్యాయని త్వరలో ఆ పనులు కూడా చేపడతామన్నారు. పత్తికొండ డివిజన్‌లో పెద్ద ఆసుపత్రిగా దీనిని తీర్చిదిద్దుతామన్నారు. ఆయనతోపాటు ఆసుపత్రి కమిటీ సభ్యులు సాంబశివారెడ్డి, సురేశ్‌కుమార్, బత్తిన లోక్‌నాథ్, ఆసుపత్రి ఇంచార్జీ డాక్టర్ కల్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలంలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ మండల అధ్యక్షుడు లక్ష్మన్న ప్రధాన కార్యదర్శి రామకృష్ణ కోరారు. మంగళవారం ఎంఈవో భూపాల్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్‌ను అప్‌డేట్ చేయాలని కోరారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయుల జీతాలు బదిలీ పొందిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. నాగరాజు మహాదేవప్ప, సుంకన్న, రామాంజినేయులు, వీరచంద్రయాదవ్, షేక్షావలి, సూర్యుడు, ఆంజనేయ, సుధాకర్ బాబు, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


ర్యాలీలో పాల్గొన్న వైకుంఠం జ్యోతి, శివప్రసాద్


మాట్లాడుతున్న వైకుంఠం జ్యోతి

- ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించింది వైకుంఠం కుటుంబమే
- బహిరంగ సభలో టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి

చిప్పగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెలుగుదేశం పార్టీ లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. మంగళశారం సాయంత్రం చిప్పగిరిలో దివంగత నేత వైకుంఠం శ్రీరాములు 19వ వర్ధంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భోగేశ్వరస్వామి దేవలయం వద్ద ఆలూరు బ్రాంచ్ కెనాల్ అధ్యక్షులు నగరడోన కిష్టప్ప అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గంలో రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్న దివంగత నేత వైకుంఠం శ్రీరాములు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన ఘనత వైకుంఠం కుటుంబానిదేనన్నారు. నియోజకవర్గంలో టీడీపీ అభివృద్ధి కోసం చివరి దాకా పని చేశానన్నారు. ముగ్గురు ఎమ్మెల్యేలను అసెంబ్లీకి పంపిన చరిత్ర వైకుంఠం శ్రీరాములుకే దక్కుతుందన్నారు. కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా పనిచేసి రైతుల సంక్షేమానికి పాటు పడ్డారన్నారు. అనంతరం టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠంమాట్లాడుతూ నియోజకవర్గంలో కొందరు మంత్రులుగా పనిచేసినా అభివృద్ధి చేయలేదన్నారు. గతంలో పేకాట క్లబ్‌లు నిర్వహించే వారు టీడీపీ కార్యకర్తలపై దౌర్జన్యాలు చేశారన్నారు. ఆలూరులో గొడవలు సృష్టిస్తున్నారని ఎమ్మెల్యే విరుపాక్షి మాట్లాడడం సరికాదన్నారు. ఆలూరు సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలన్నారు. కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి తీరుతామన్నారు. మార్కెట్‌యార్డు చైర్మన్ వెంకటేష్, వైస్ చైర్మన్ రంగడు, టీడీపీ నాయకులు తిమ్మయ్య, వెంకటేష్, ఏరూరు మహేష్, శేషగిరి, విష్ణువర్ధన్‌రెడ్డి, కటారికొండ సీనప్ప, కొండ రామాంజనేయులు, కొండ పురుషోత్తం, అంపయ్య, ఏరూరు రామంజి, రవియాదవ్, వెంకటప్ప, హరి, చిరంజీవి, మేకల రామాంజనేయులు, సర్పంచ్ గోవింద్‌రాజులు, నీలకంఠ, సావిత్రి, దస్తగిరి, ప్రకాష్, కృష్ణయాదవ్, ఈరన్న, శ్రీధర్, మారుతి, తిప్పయ్య, నరసప్ప, గుండన్న, వెంకన్న పాల్గొన్నారు.

వైద్య విద్యను ఉచితంగా అందించాలి


కోటి సంతకాల కార్యక్రమంలో ఎమ్మెల్యే విరుపాక్షి

దేవనకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో మాదిరిగానే వైద్యవిద్యను పేదలకు అందించాలని ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి కూటమీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని తెర్నేకల్, నల్లచెలిమల గ్రామాలలో కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొన్నారు. పేదలకు విద్య, వైద్యం ఉచితంగా అందేలా చుడాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి సురేంద్రరెడ్డి, జిల్లా కోశాధికారి మధుసుదన్‌రెడ్డి, జెడ్పీటీసీ రామకృష్ణ, సర్పంచు ఆరుణ్‌కుమార్, లూముంబా, చాపవీరన్న, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి:ప్రభుత్వ వైద్యకళాశాలలను ప్రైవేటీకరణ చేయడం అన్యాయం అని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముక్కెళ్లలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించి వైద్యశాలలను ప్రైవేటీకరణ చేయకూడదని సంతకాల సేకరణ చేశారు.జడ్పీటీసీ సభ్యులు మురళీధర్ రెడ్డి, జగన్నాథరెడ్డి, జిట్టా నగేష్, చంద్రన్న, చిరంజీవి, వెంకటేశ్వర్లు, గోవర్ధన్ రెడ్డి, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే పత్తిని కొంటుంది

మద్దికెర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):మండలంలో రైతులు సాగు చేసి పండించిన పత్తి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వ్యవసాయ శాఖ అధికారి రవి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలో రైతు సేవా కేంద్రంలో రైతుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పత్తి పంటను ఆన్‌లైన్ చేసుకుంటే ప్రభుత్వం మద్దతు ధర క్వింటం రూ.7,500ల వరకు ఇస్తుందన్నారు. . రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. అలాగే పంటలకు ఆశించిన పురుగుల నివారణకు మందులు వాడాలన్నారు. వేరుశనగలో జిప్సం ప్రాముఖ్యత గురించి వివరించారు. వీఏఏ ఇంద్రజ, వీహెచ్ఏ రాజశేఖర్, ఎంపీఈవో మాధవి రైతులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిని నిర్మూలిద్దాం

మద్దికెర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):కుష్ఠు వ్యాధిని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని ప్రభుత్వ వైద్యాదికారిణి శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మద్దికెరలో కుష్ఠు వ్యాధిపై జరుగుతున్న ఇంటింటి సర్వేను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో కుష్ఠు రహిత సమాజాన్ని నిర్మూలించాలని కోరారు.కార్యక్రమంలో సీహెచ్‌వో నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ అక్బర్ బాషా, ఆరోగ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదోని రూరల్: క్షయ వ్యాధిని సంబంధిత రోగగ్రస్తులు నిర్లక్ష్యం చేయవద్దని పెద్దతుంబళం పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ ఆశాలత, భరత్ కుమార్‌లు తెలిపారు. మంగళవారం పిహెచ్‌సిలో క్షయ వ్యాధి గ్రస్థులకు ఉచితంగా పోషక ఆహార కిట్లతోపాటు ఆరునెలలకు సరిపడే మందులను అందించారు. కార్యక్రమంలో డాక్టర్ షేక్ బాను, సూపర్‌వైజర్ మంగమ్మ, కస్తూర్బాయి, బాబురాజ్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించాలి



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న బీఎల్‌వోలు

మద్దికెర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 2022-25 వరకు ఓటరు జాబితాలో తప్పు ఒప్పులు సరి చేసి పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ గూండాల్ నాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలు ఓటరు జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో మరణించిన వారి పేర్లు, వివాహం చేసుకుని వెళ్లిపోయిన వారి పేర్లు తొలగించాలన్నారు. అలాగే శాశ్వతంఆ వలస వెళ్లిన వారి పేర్లు కూడా తొలగించాలన్నారు. ఓటరు జాబితాలో కుటుంబ సభ్యులందరూ ఒకే వార్డులో ఉండే విదంగా చూడాలన్నారు. బీఎల్‌వోలు బాలవర్ధన్ రాజు, రాముా యాదవ్, దామోదర్ పాల్గొన్నారు.

షష్టి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

మద్దికెర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని మద్దమ్మకుంట గ్రామ సమీపాన వెలసిన సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఈ నెల 25, 26, 27 తేదీల్లో జరిగే సుబ్రహ్మణ్య స్వామి షష్టి ఉత్సవాలకు హాజరు కావాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును ఆహ్వానించారు. మంగళవారం ఆలయ నిర్వహకులు విజయప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను పత్తికొండలో కలిసి ఆహ్వానించి స్వామివారి చిత్రపటాన్ని, షీల్డ్‌ను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ షష్టి ఉత్సవాలకు సహకారం అందిస్తామని తెలిపారన్నారు. షష్టి ఉత్సవాల్లో పాల్గొనేందుకు ప్రయత్నిస్తాననీ తెలిపారు. జయరామిరెడ్డి, చొక్కా సునీల్ కుమార్ తదితరులు ఉన్నారు.

జిల్లా సాధన శిబిరానికి మద్దతు



మద్దతు తెలుపుతున్న జంగమ నాయకులు

ఆదోని టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆదోని జిల్లా ఏర్పాటుతోపాటు పెద్ద హరివాణం మండల ఏర్పాటు కోసం రిలే నిరాహార దీక్షలను చేస్తున్న జిల్లా సాధన కమిటీ శిబిరానికి రాష్ట్ర జంగమ మహేశ్వర సంక్షేమ సంఘంతోపాటు ఆదోని డివిజన్ జంగమ అర్చక సమాఖ్య వారు మంగళవారం నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి తమ మద్దతును ప్రకటించారు. ఆదోని జిల్లా ఏర్పాటుతో ఈ ప్రాంతం కొంతవరకైనా అభివృద్ధి సాధించడానికి అవకాశం ఉన్నందున, జిల్లగా ప్రకటించే వరకు ఈ ఉద్యమం ఇలాగే కొనసాగాలని కోరారు. జే చంద్రశేఖరయ్య స్వామి, బసవరాజు స్వామి, రమలింగయ్య స్వామి, వీరభద్రయ్య స్వామి, నూగురయ్య స్వామి పాల్గొన్నారు.

కూటమిలో లుకలుకలు!

- ఆదోనిలో మారుతున్న రాజకీయ సమీకరణాలు
- బీజేపీ ఎమ్మెల్యే వర్సెస్ టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్గీయులు
- సోషల్ మీడియా వేదికగా నిందారోపణలు
- స్థానిక ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం

ఆదోని, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆదోని నియోజకవర్గంలో అంతర్గత విబేధాలు రోజురోజుకూ తీవ్రతరమవుతున్నాయి. తాజాగా ఆదోని నియోజకవర్గం ఈ వర్గపోరుకు కేంద్రంగా మారింది. ఇక్కడ బీజేపీ ఎమ్మెల్యే డా.పార్థసారథి వర్గీయులు, టీడీపీ మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు వర్గీయులు మధ్య నడుస్తున్న బహిరంగ మాటల యుద్ధం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.



● **సోషల్ మీడియా వేదికగా:** బహిరంగ చర్చల్లోనూ రెండువర్గాల నేతలు పరస్పరం వ్యక్తిగత విమర్శలకు దిగుతూ పొత్తు ధర్మాన్ని ఉల్లంఘిస్తున్నారు.

● **టీడీపీ వర్గపు ఆరోపణలు:** టీడీపీ మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు వర్గానికి చెందిన నాయకుడు బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథిపై ఘాటుగా విమర్శలు గుప్పిస్తున్నారు. కేవలం 23 రోజుల్లో ఎమ్మెల్యే అయిన పార్థసారథికి ఆదోని చరిత్ర గురించి, ఇక్కడి సమస్యల గురించి ఏం తెలుసు అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. క్షేత్రస్థాయిలో పనులు చేపట్టడంలో వైఫల్యం చెందుతున్నారంటూ ప్రశ్నించారు.

● **మూలకారణం ఇదేనా...?** ఈ వివాదం వెనుక ఇటీవల వైఎస్సార్సీపీ నుంచి బీజేపీలోకి వచ్చిన కొత్త నేతల ప్రమేయం ఉందని టీడీపీ వర్గాలు పరోక్షంగా ఆరోపిస్తున్నాయి. పార్థసారథి ఆ కొత్త నేతలను నమ్ముతూ ముందుకు వెళ్తుండడం వల్ల కూటమిలోని పాత, నమ్మకమైన నేతలను విస్మరించడానికి దారి తీస్తోందని అంటున్నారు.

● **స్థానిక ఎన్నికల్లో ముప్పు** ఈ అంతర్గత కలహాల కారణంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ఇరు పార్టీల కార్యకర్తలు స్థానిక ఎన్నికల్లో పరస్పరం సహకరించుకోకపోవడం వల్ల రెండు వర్గాల ఓట్లు చీలిపోయి, ప్రత్యర్థి పార్టీకి లాభం చేకూరే అవకాశం ఉంది. వైసీపీలో ఉంటూ బీజేపీ తీర్థం పుచ్చుకున్న వాళ్లందరూ లాభపడుతున్నారని, ఎమ్మెల్యేకు సైతం టీడీపీపై లేనిపోని మాటలు చెబుతూ తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇటీవల టీడీపీ పట్టణ, మండల అధ్యక్షులు తిమ్మప్ప, శివప్పలు సోషల్ మీడియా వేదికగా ఆరోపణలు గుప్పించారు. అదేకోవలోనే బీజేపీ నాయకులు సైతం మేమేం తక్కువ అన్నట్టుగా వారు కూడా సోషల్ మీడియా ద్వారా 60-40 పర్సంటేజీల ద్వారా కుమ్మక్కయ్యారంటూ నిందారోపణలు చేశారు. ఏదేమైనా బీజేపీ వర్సెస్ టీడీపీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఆదోనిలో దాపరించిందంటే అతిశయోక్తి కాదు.అధిష్టానం తక్షణమే జోక్యం చేసుకోకుంటే స్థానిక ఎన్నికలపై ప్రభావం పడుతుందని విశ్లేషకులు అభిప్రాయం

భూమాత రక్షణ కమిటీతో రైతులకు లాభాలు



చెట్నహళ్లిలో రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు, అధికారులు

మంత్రాలయం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూమాత రక్షణ కమిటీల వల్ల రైతులకు ఎన్నో లాభాలు ఉన్నాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు సుజాతమ్మ, వైఎస్ సతీష్, మండల వ్యవసాయ అధికారి జీరా గణేష్ అన్నారు. మంగళవారం చెట్నహళ్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ బెస్త అంజనేయులు, ఏఈవో తిరుమలరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు బాల విజయ్ ఆధ్వర్యంలో భూమాత రక్షణ కమిటీ ఏర్పాటు చేసి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదే విధంగా పొలం పిలుస్తుంది లో బాగంగా పత్తి, వరి, వేరుశనగ పంటలను పరిశీలించారు. గ్రామాల్లో రైతులు వ్యవసాయ అధికారులు సూచించిన సలహాలు పాటించాలని కోరారు. ఈ సమావేశంలో తిక్కస్వామి, భీమేష్, హనుమంతు పాల్గొన్నారు.

నూతన భవనాలు ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో బీసీ సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గఫూర్, అబ్దుల్ ఖాదర్ డిమాండ్ చేశారు. మంగళవారం హాస్టళ్లలో ఉండే విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎన్నికల డీటీ వలిబాషాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు ఇర్ఫాన్, సాహిత్, హనుమంతు, రవి, శేక్షావలి, రమేష్ పాల్గొన్నారు.

వైభవంగా పద్మనాభ తీర్థుల పూర్వారాధన


పద్మనాభ తీర్థుల బృందావనానికి పూజలు చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి పరమగురువులైన పూర్వపు పీఠాధిపతులు పద్మనాభ తీర్థుల పూర్వరాధన మహోత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. కర్ణాకటలోని అనుగొంది నవబృందావనంలో వెలసిన పద్మనాభ తీర్థుల బృందావనానికి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం వేదపండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ద్వారపాలక అనంతస్వామి, ప్రకాష్ఆచార్, పవన్ ఆచర్, విజయేంద్రాచార్, ఆనందతీర్థ ఆచార్, గౌతమ్ ఆచార్, గోపాలకృష్ణస్వామి, వరధేంద్రాచార్ పాల్గొన్నారు.

గ్రంథాలయాల ద్వారా జ్ఞానసంపద

మంత్రాలయం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల ద్వారా ఎన్నో తెలియని విషయాలు తెలుసుకుని జ్ఞాన సంపద పొందవచ్చని ఎంఈవో రాగన్న అన్నారు. మంగళవారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో గ్రంథాలయ సిబ్బంది వసంతలక్ష్మి, శివప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఖోఖో, పరుగుపందెం, మ్యూజికల్ చైర్స్ పోటీలను ఫిజికల్ డైరెక్టర్ రవీంద్ర నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి మహుమతులు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలోహెచ్ఎం విఠోభరావు, నాగరాజు నాయక్, గోట్ల చంద్రశేఖర్, గోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దాలి

మంత్రాలయం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులందరిపై ఉందని ఎంఈఓ రాఘన్న అన్నారు. మంగళవారం మంత్రాలయం జడ్పీ ఉన్నతపాఠశాలలో టీచ్ టూల్ రెండు రోజుల శిక్షణ కార్యక్రమం హెచ్ఎం విఠభరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. రీసర్చ్ పర్సన్స్ మల్లికార్జున, ఇమ్రాన్,ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శీలప్ప, శ్రీనివాసులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: ఉపాధ్యాయులు బోధనలో నైపుణ్యతను పెంపోందించుకోవాలని యంఈవో-2 రాంమూర్తి అన్నారు. మంగళవారం హనుమాపురం గ్రామంలోని ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బోధన సమయంలో తరగతుల్లో ఉపయోగపడే చార్టులు, ఫ్లకార్డ్స్ తదితర బోధన కిట్లు ఉపయోగించుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ విజయకూమారి, రాజ్యలక్ష్మి, వీరేష్, లక్ష్మన్న పాల్గొన్నారు.

కోసిగి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు టీచర్లు నాణ్యమైన విద్య అందించాలని ఎంఈవో-1 బాలయ్య తెలిపారు. మంగళవారం కోసిగిలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు టీచ్ టూల్ అబ్జర్వేషన్పై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ శ్రీధర్‌బాబు, శ్రీలత, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు


మాట్లాడుతున్న కాశీంవలి

నందవరం, నవంబరు 18(ఆంధ్ర జ్యోతి): టీడీపీ చేస్తున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేకనే వైసీపీ నాయకులు విమర్శలు చేస్తున్నరని టీడీపీ మండల పార్టీ కన్వీనర్ కాశీంవలి అన్నారు. మంగళవారం ఆయన మాట్లడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఉచితంగా గ్యాస్, ఉచిత బస్స ప్రయాణం లాంటివి ఇచ్చిన హామీలన్ని దశల వారిగా నెరవేరుస్తుంటే వైసీపీకి మింగుడు పడడం లేదన్నారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి నియోజకవర్గాన్ని నందనవనంగా చేస్తుంటే వైసీపీ నాయకులు అభివృద్ధిని అడ్డుకునేదే పనిగా పెట్టుకుని విమర్శలు చేస్తున్నారన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు గ్రామాల్లో, పట్టాణాల్లో పిడికెడు మట్టి వేసిన పాపాన పోలేదని గుర్తు చేశారు. సమావేశంలో నాయకులు చిన్న కొత్తిలి సత్యారెడ్డి, తదితరులు ఉన్నారు.

ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి ఫారం భూముల్లో అక్రమంగా ఎర్రగరుసు తవ్వుతున్న దృశ్యం



తవ్వుకో..దోచుకో!

- బనవాసి ఫారంలో ఎర్రగరుసు అక్రమ తవ్వకాలు
- కొండలను, గుట్టలను కుళ్లబొడుస్తున్న వైనం
- ఎర్రగరుసు అక్రమంగా తరలింపు
- అంతరించి పోతున్న ప్రకృతి సంపద
- పట్టించుకోని అధికారులు

నియోజకవర్గంలోని గ్రామ శివారుల్లో అందమైన కొండలు ఉన్నాయి. వీటిపై కొందరు కన్ను పడింది. దీంతో కొండలు కనుమరగువుతున్నాయి. అనుమతులు లేకున్నా యథేచ్ఛగా తవ్వకాలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఒక టిప్పర్ మట్టి రూ. 10 వేల వరకు అమ్ముకుంటున్నారు. ఇలా రోజుకు ఒక్కో టిప్పర్ సుమారు 10 ట్రిప్పుల మట్టిని తరలిస్తున్నారు. గరుసు మట్టి తవ్వకాలు జోరుగా జరుగుతున్న విషయం అధికారులకు తెలిసినా ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అయితే కొన్ని చోట్ల తూతూ మంత్రంగా దాడులు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇలా తవ్వకాలు ఇష్టానుసారంగా చేస్తూ పోతే కొండలు ఇక కనిపించవు.


కొండను తవ్విన దృశ్యం

ఎమ్మిగనూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి)

ఎమ్మిగనూరులోని బనవాసి పశుక్షేత్రం పరిధిలోని గరుసు తిప్పలో ఎర్రగరుసు అనుమతులతో కొంతమంది అక్రమార్కులు మట్టిని తరలిస్తున్నారు. బనవాసి ఫారంలో ఉన్న ఎఫ్ఎస్‌బీఎస్ (ఘనీకృతవీర్య ఆబోతు కేంద్రం)పరిధిలో వన్నం బాయి సమీపంలో ఉన్న మరుసు తిప్పలో గత రెండు రోజులుగా కొంతమంది ఎలాంటి అనుమతులు లేకుండా ఎక్సకవేటర్‌పెట్టి గరుసుతిప్పను తవ్వి ఎర్రగరుసును టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. తవ్వకాలు జరుగుతున్నా విషయం సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికే అదే తిప్ప నుంచి స్థానికంగా ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ పనులకు గరుసును తవ్వి తరలించారు. ఇదే ముసుగులో తాజాగా రెండు రోజులనుంచి ఐదు టిప్పర్లతో ఎర్రగరుసును ఆదోని ప్రాంతానికి తరలించారు. అయితే గరుసు తవ్వకం దారులు తమకు అనుమతులు ఉన్నట్లు బుకాయిస్తున్నట్లు తెలిసింది. అంతేగాక అదే పశుక్షేత్రం పరిధిలోని వెంకటగిరి గ్రామం వైపు సైతం కొంతమంది ఏ మాత్రం అనుమతులు లేకుండా కొండలను రాళ్లకోసం, గరుసుకోసం తవ్వుతున్నారు. పశుక్షేత్రం సిబ్బందికి స్థానికులు చెప్పినా తెలిసి తెలియనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే ప్రకృతి సంపద పూర్తిగా అంతరించి పోయో ప్రమాదం ఉంది. గరుసు తవ్వకాలతో ఆప్రాంతంలో ఉన్న వివిధ రకాల పక్షులు, జంతువులు, వృక్షసంపద మనుగడ కోల్పోయో ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే గరుసు తవ్వకాలకు అడ్డుకట్ట వేయల్సిన అవసరం ఉంది.

అక్రమార్కుల కన్ను



బనవాసి పశుక్షేత్రం పరిధిలో మైక్రో వాటర్ షెడ్ కింద ఒక పెర్క్యులేషన్ ట్యాంకుతో పాటు అదే ప్రాంతంలో మూడు చోట్ల నీటి కుంటను తవ్వారు. గుంతల్లో నుంచి తీసిన ఎర్రమట్టి, ఎర్రగరుసును కొంతమంది అక్రమార్కులు ట్రాక్టర్ల ద్వారా గుట్టు చప్పుడు కాకుండా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వాటర్ షెడ్ నిర్వాహకులు పర్యవేక్షణ లేకపోవడం వల్లే గరుసును, మట్టిని తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

● గరుసు తవ్వకాలపై సెమెన్ బ్యాంకు ఇన్‌చార్జీ డీడీ రమణమూర్తిని వివరణ కోరగా గరుసు తవ్వకాలు జరుగుతున్న విషయం తన దృష్టికి రాలేదని, సిబ్బంది ద్వారా తెలుసుకొని చర్యలు తీసుకుంటాం. గరుసు తవ్వుకునేందుకు అనుమతి ఇచ్చే అధికారం నాకు లేదని, కలెక్టర్ లేదా సీఈవో ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు.

కనుమరుగవుతున్న కొండలు, గుట్టలు, తిప్పలు

ఎమ్మిగనూరు మండలం, పెద్దకడబూరు, కోసిగి, గోనెగండ్ల, నందవరం మండలాల్లో జోరుగా ఎర్రమట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. కొన్ని గ్రామాల్లో కొండలు ఎంతో అందంగా ఉన్నాయి. వాటిని కూడా వదలడం లేదు. ఎవరూ అధికారంలో ఉంటే వారు ఇష్టానుసారంగా తవ్వకాలు చేపట్టి జేబులు నింపుకుంటున్నారు. అధికారులకు తెలిసినా ఏమి చేయలేని పరిస్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఏమైనా దాడులు నిర్వహిస్తే పై స్థాయి అధికారులు, రాజకీయ నాయకుల నుంచి నుంచి ఒత్తి ళ్లు తెచ్చి మరి తవ్వకాలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నా యి.

● ఎమ్మిగనూరు మండలంలోని గుడికల్, హనుమాపురం,కోటకల్లు, దేవిమెట్ట, పెద్దకడబూరు మండలం మాస్మాన్‌దొడ్డి, రాగిమాన్‌దొడ్డి, నందవరం మండలంలోని కదనాతి, కడివెళ్ల, కడిమెట్ల, ముగతి, గోనెగండ్ల, బాపురం, తదితర గ్రామాల్లోని తిప్పలను రాజకీయ నాయకులు వదలడం లేదు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ ధ్యేయం

ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని కుర్ణీకమ్యూనిటిహాల్‌లో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని ఆయా గ్రామలకు చెందిన ప్రజలు హాజరై తమ సమస్యలను అర్జీ రూపంలో ఎమ్మెల్యేకు అందజేశారు. దాదాపు 200మంది ప్రజాదర్బార్‌లో పాల్గొని పెన్షన్లు, ఇంటి స్థలాలు, గృహాల మంజూరు, భూ సమస్యలు, తాగునీరు, వీధిదీపాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీల సమస్యలతో పాటు ఇతర సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తన దృష్టికి తెచ్చిన వినతులను ఆయా శాఖల అధికారులకు పంపి ఆ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.టి వెంకటేశ్వర్లు, జగదీష్, సురేష్‌చౌదరి, వీరనాగప్ప, సొసైటీ చైర్మన్ గౌస్‌పీరా, రాఘవేంద్ర, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలి



ర్యాలీ చేస్తున్న నాయకులు

పెద్దకడబూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పత్తి రైతుకి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం నాయకులు మబ్బు ఆంజినేయ, వీరేష్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దకడబూరులోని బస్టాండ్ ఆవరణలో రైతులతో కలిసి రైతు సంఘం నాయకులు ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ ఏడాది అధిక వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులకు గిట్టుబాటు ధరల కల్పించి రెండు పంటలకు నీళ్లు ఇవ్వాలన్నారు. అలాగే నవంబర్19, 20 తేదీలలో నిర్వహించే రైతుల రాష్ట్ర సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు చంద్ర, నాగరాజు, జాఫర్,గిడ్డయ్య, బాబు, అలీ బాషా పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసే నాలుగో విడుత తేనెటీగల పెంపక శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేవీకే బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రాఘవేంద్ర చౌదరి కోరారు. మంగళవారం నాల్గవ విడుత తేనెటీగల పెంపక శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేనెటీగల పెంపకంతో ఎంతో మంది రైతులకు ఉపయోగం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు తేనెటీగల పెంపకంలో పాల్గొని శిక్షణను పూర్తిచేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. వారం రోజుల పాటు శిక్షణా కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

21 నుంచి సాగు నీరు విడుదల


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న జీడీపీ సాగు నీటి సంఘం సభ్యులు, అధికారులు

గోనెగండ్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు కింద రబీలో సాగు చేసుకుంటున్న ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ ప్రాంతాల ఆయకట్టు రైతులకు 21 నుంచి సాగు నీరు విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. మంగళవారం గాజులదిన్నె ప్రాజెక్టు సాగునీటి సంఘం అధ్యక్షుడు, సభ్యులు ఇరిగేషన్ అధికారులు ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీజయనాగేశ్వరరెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని కలిశారు. జీడీపీ సాగునీటి సంఘం సభ్యులు చేసుకున్న తీర్మానం చేసుకున్న విషయాన్ని తెలిపారు. అందుకు ముగ్గురు ఎమ్మెల్యేలు సమ్మతించారు. 21 న ముహూర్తం ఖరారు చేశారు. ప్రాజెక్ట కింద దాదాపు 12500 నుంచి 13000 వేల ఎకరాల వరకు సాగు కావచ్చునని తెలిపారు. కార్యక్రమంలో జీడీపీ సాగునీటి సంఘం అధ్యక్షుడు మల్లికార్జున గౌడ్, మద్దయ్య, కౌలుట్ల, పురుషోత్తం రెడ్డి, లింగన్న పాల్గొన్నారు.

ఇద్దరికి ఏడు రోజులు జైలు

గోనెగండ్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్‌కేసులో పట్టుబడిన గొల్లమురళి, షేక్ అన్వర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వారిని మంగళవారం పత్తి కొండ కోర్టులో హాజరు పరచగా వారికి న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ. 10వేల జరిమానా, ఏడు రోజులు జైలు శిక్ష విధించినట్లు గోనెగండ్ల పోలీసులు తెలిపారు.

యువకుడి మృతి

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఒరిస్సా రాష్ట్రానికి చెందిన యువకుడు టికెలాల్ ఒరియా (36) అనే యువకుడు శివ సర్కిల్‌లో మృతి చెందాడు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఒరిస్సాకు చెందిన టికెలాల్ వారి కుటుంబ సభ్యులతో కలసి ఎమ్మిగనూరు మండలం చెన్నాపురం గ్రామ సమీపంలో ఉన్న ఇటుక బట్టిలో పని చేస్తూ జీవనం సాగించేవాడు. ఇటీవల తాగుడుకు బానిసై అయ్యాడు. సోమవారం రాత్రి ఫిడ్స్ రావడం, గుండె పోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా మృతదేహన్ని ఒరిస్సాకు తీసుకెళ్లారని పోలీసులు తెలిపారు.

ఎకరాకు పది క్వింటాళ్ల చొప్పున పత్తి కొనుగోళ్లు



కోల్‌మాన్‌పేటలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కోసిగి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ఒక ఎకరాకు పది క్వింటాళ్ల చొప్పున రైతులు పత్తి అమ్మకాలు జరపుకోవచ్చని మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ తెలిపారు. మంగళవారం కోల్‌మాన్‌పేట, దుద్ది గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో మాట్లాడుతూ మొక్కజొన్న వేసిన పొలాల్లో కత్తెర పురుగును గమనించి కత్తెర పురుగు ఉధృతిని కనుగొనడానికి ఎకరాకు 6 చొప్పున లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని, కత్తెర పురుగు నివారణ కోసం లీటరు నీటికి 0.5 గ్రాముల ఇమామెక్టిన్ బెంజోయేట్ లేదా లీటరు నీటిలో 0.3 మిలీమీటర్ల క్లోర్రాంత నిడిప్రోలు అనే పురుగు మందును సుడులు తడిచే విదంగా పిచికారి చేయాలన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కోసిగి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి అన్నారు. మంగళవారం కోసిగిలోని బాలుర ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాల గురించి విద్యార్థులకు అవగాహననిర్వహించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ మునిరంగడు, ఉపాధ్యాయులు నరసింహులు, వెంకటరెడ్డి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహాలు


లబ్ధిదారుల పత్రాలు పరిశీలిస్తున్న ఎంపీడీవో

నందవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పక్కా గృహాలు మంజూరు చేస్తామని ఎంపీడీవో పుల్లయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని సోమలగూడురులో కొత్తగా ఇళ్లు కట్టుకునే వారి పత్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఇళ్లు కట్టుకోని వారందరికి కొత్తగా ఇళ్లు మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సందీప్ , పంచాయతీ అధికారి పాల్గొన్నారు.

ఎస్ఎంఎల్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ఎమ్మిగనూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణ శివారులోని ఆదోని రోడ్డులో ఉన్న ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపల్ డా మహబూబ్ బాషా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బీఏ హిస్టరీ, ఎకనామిక్స్, బీఎస్సీ ఫిజిక్స్, జువాలజీ, కెమిస్ట్రీ, బోటనీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులలో చేరదలచుకున్న వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

గాజులదిన్నె, గోనెగండ్ల రైతులతో ముఖాముఖి

గోనెగండ్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర వ్యవసాయశాఖ నుంచి వచ్చిన ఉన్నతాధికారుల బృందం మంగళవారం గోనెగండ్ల, గాజులదిన్నె గ్రామాలలో పర్యటించింది. ఈ గ్రామాలలో ఉల్లి రైతులతో బృందం సభ్యులు ముఖాముఖి మాట్లాడారు. ఉల్లి పంటను ఎప్పుడు సాగు చేశారు? ఎన్ని ఎకరాలలో సాగుచేశారు? ఏ రకం విత్తనాలను వాడారు? పంట దిగుబడి ఎలా వచ్చింది? వంటి వివరాలు తెలుసుకున్నారు. తెగుళ్లు సోకిన ఉల్లి పంటను బృందం సభ్యులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి రాజకృష్ణారెడ్డి, మైక్రో ఇరిగేషన్ అధికారి ఫిరోజ్‌ఉస్సేన్, డీడీహెచ్ జమదగ్ని, వ్యవసాయశాఖ జేడీ వరలక్ష్మి, ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత పాల్గొన్నారు.

తెగుళ్లు సోకడంతో దిగుబడి తగ్గిపోయింది



ఈ ఏడాది మూడు ఎకరాలను కౌలుకు తీసుకొని రూ. 4లక్షల పెట్టుబడి పెట్టి ఉల్లిపంటను సాగు చేశాను. ఈ ఏడాది అధిక వర్షాలు కురవడంతో పంటకు తెగుళ్లు ఎక్కువగా సోకాయి. దీంతో దిగుబడి పూర్తి తగ్గిపోయింది. మార్కెట్‌లో కూడా పంటకు గిట్టుబాటు ధరలేదు. నేడో రేపో ఈ పంటను మూగజీవాలను గ్రాసంగా వదులుతాను.

● గొరవ మునెప్ప, కౌలు రైతు, గాజులదిన్నె. గోనెగండ్ల మండలం

మూడేళ్లు నష్టమే



నాకున్న రెండు ఎకరాలలో రూ. 1.60 లక్షలు పెట్టుబడి పెట్టి ఉల్లి పంటను సాగు చేశాను. ఒక ఏడాది పంటను గిట్టుబాటు ధర పలికితే మరో మూడేళ్ల పంటకు ధర ఉండదు. ఈ ఏడాది అధిక వర్షాలు కురిశాయి. దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. కేవలం 20 క్వింటాళ్లకు మించి రాలేదు.

● తిమ్మారెడ్డి, హెచ్ కైరవాడి ఉల్లి రైతు, గోనెగండ్ల మండలం

మరోసారి ఉల్లిపంటను సాగు చేయను


అధికారులతో మాట్లాడుతున్న రైతు

రెండు ఎకరాలలో ఉల్లి పంటను సాగు చేశాను. 401 రకం ఉల్లిని సాగు చేశాను. గత కొన్నేళ్ల నుంచి ఉల్లిని ప్రతి ఏడాది సాగు చేస్తున్నా. ఈ ఏడాది వచ్చినంత కష్టం ఎప్పుడూ రాలేదు. ఇలాగే మరోసారి వస్తే నా జీవితంలో ఇక ఉల్లి పంటను సాగు చేయను.

- చాకలి రామచంద్ర, ఉల్లి రైతు, గోనెగండ్ల

61వేల ఎకరాల్లో ఉల్లి పంట నష్టం


ఉల్లినాటు వేసే యంత్రాన్ని కేంద్రబృందానికి చూపుతున్న హెచ్‌వో శ్రీవాణి

జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 61వేల ఎకరాలలో ఉల్లి పంటను సాగు చేశారని, అధిక వర్షాలు, తెగుళ్లు, వాతవరణం కారణంగా ఉల్లి పంట దెబ్బతిన్నదని హెచ్‌వో శ్రీవాణి తెలిపారు. జిల్లాలో ఉల్లి పంట నష్టపోయిన రైతు కోసం జిల్లా హార్టికల్చర్ అధికారులు సర్వే చే సి పంట నష్టపోయిన రైతుల జాబితాను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 5400 ఎకరాలలో ఉల్లి పంటను సాగు చేశారని అయితే గోనెగండ్ల మండలంలో మాత్రమే 3220 ఎకరాలలో ఉల్లిని సాగు చేసినట్లు తెలిపారు.